

# బంధాలు

వాసిరెడ్డి సీతాదేవి

రెవిన్యూస్టాంపు మీద సంతకం చేస్తున్నప్పుడు జానకి చేతివేళ్ళు వణికాయి. ఇదే ఆమె ఆ ఆఫీసులో తీసుకునే ఆఖరు జీతం. పరధ్యాన్నంగా తీసుకొని, యాంత్రికంగా పర్సులో పెట్టా. ఉషారుగా బయటికి నడిచే జానకినిచూసి, ఆఫీసులో కొందరు జాలిపడ్డారు, మరి కొందరు జాలిపడుతున్నట్టు ముఖాలు పెట్టారు.

జానకి తలవంచుకొని కాళ్ళీడ్చుకొంటూ పేవ్‌మెంట్ మీద నడవసాగింది. ఆమెకు భవిష్యత్తంతా అంధకారమయంగా కనిపించ సాగింది. రోడ్డుకు అటూ యిటూ వందల

సంఖ్యల్లో జనం నడిచి పోతున్నారు; కార్లూ, రిక్షాలూ రణగొణ ధ్వనిచేస్తూ పరిగెత్తుతున్నవి. కాని, జానకి యివేమీ గమనించే స్థితిలో లేదు. తను హఠాత్తుగా ఏదో నిర్జనప్రదేశానికి విసరివేయబడినట్టు ఆమెకు అనుభూతి కలిగి, మనస్సు గిలగిల కొట్టుకున్నది.

వీధి దీపాలు వెలిగాయి. జానకి నిద్ర మైకంలో వున్నదానిలా తడబడుతూ నడిచి, అలవాటు ప్రకారం లక్డీకాపూల్ బస్‌స్టాండు దగ్గిర నిలబడింది. ఆమె ఆలోచన లిప్పుడు పర్సులోవున్న తొంభై నాలుగురూపాయలచుట్టూ తిరగసాగినై. ఈ డబ్బుతో ఎన్నో వారాలు కాదు, రోజులు బతకటమే కష్టం అనుకున్నది జానకి. ఇంట్లో అడుగుపెట్టగానే అమ్మ ఎవ రెవరికి ఎంత ఇవ్వాలో ఏకరువు బెడుతుంది. అవన్నీ వెంటనే తీర్చవలసిన అప్పులు. ఆ మొత్తం అరవై రూపాయలకు తక్కువ వుండదు. ఇందులో అమ్మను తప్పుపట్టేందు కేమీలేదు. పాపం ఆమెమాత్రం ఏంచేస్తుంది? అన్నీ ఇంటి అవసరాలకు తప్పనిసరిగా అయే ఖర్చులే. అసలే జబ్బు మనిషి. తనకు ఉద్యోగం పోయిందని తెలిస్తే...

ఈ దుస్థితికంతా కారణం ఆ సర్వీస్ కమిషన్ కాండిడేట్! ఇంతకాలంగా ఎక్క డెక్కడో కాలక్షేపం చేసి నావిడ, హఠాత్తుగా వచ్చి తన ఆఫీసులో, తన కుర్చీ మీదే వాలాలా? ఇంతకూ, సావిత్రి అదృష్టవంతు రాలు. తను ఆమెకన్న ఒకరోజు జూనియర్. ఒక్కరోజు జూనియర్ అయినా, జూనియరే నట! అవును. కాదనలేం. నిముషాలూ, క్షణాలే వ్యక్తుల జీవితాలను తలక్రిందులు చేస్తూంటే. ఇరవైనాలుగ్గంటల కాలానికి మరెంత అద్భుతశక్తో వుండి తీరుతుంది. సీనియర్ (ఇరవైనాలుగ్గంటల), పనిచెయ్యక పోయినా, తీసేసేందుకు రూల్సు ఒప్పవట. అవును, ఇదీ కాదనలేం...

ప్రపంచంలో సుఖసంతోషాలన్నీ అదృష్ట వంతులకే భుక్తమైనట్టు, ఈ రూల్సువాళ్ళకే ఊడిగం చేస్తుంటాయ్. కాకపోతే, సావిత్రికి వుద్యోగం వుండడమేమిటి, తనకు పోవటం ఏమిటి! అసలా సావిత్రికి ఉద్యోగం చెయ్య వలసిన ఖర్మేం? అలనాటి సత్యభామాదేవికి ఏడువారాలనగలుంటే, యీసావిత్రికిఏడురోజుల నగలైనా వుండివుంటాయి. రోజూ నగలు మార్చి మార్చివేసుకున్నట్టే కనిపిస్తుంది. కట్టిన బట్ట కట్టకుండా ముస్తాబై, కాలం ఆఫీసుకు రాగలదు. ఏదో కాలక్షేపంకోసం ఉద్యోగంచేస్తున్నాననీ. రేపో మాపో పెళ్ళి కాగానే మానేస్తాననీ, రోజుకోసారైనా ఆఫీసులో ఎవరికో ఒకరికి చెపుతుంది. ఒళ్ళువంచి పనిచెయ్యదు. పనిచెయ్యమని గట్టిగా మందలించే దమ్ములు ఆఫీసులో ఎవరికీ లేవు. రంగురంగుల చీరెలుకట్టి వన్నెలూ చిన్నెలూ ఒలకబోస్తూ, ఆఫీసులో అందర్నీ చిరునవ్వుతో పలకరించే సావిత్రి అంటే అందరూ ముచ్చట పడిపోతారు...

తన దీనస్థితికి ఆఫీసులో అందరూ మొసలి కన్నీళ్ళు కార్చినవాళ్ళే. కాని, ఉద్యోగం అవసరం లేని, ఒక్కరోజు సీనియర్ అయిన సావిత్రిని మాత్రం అక్కడే వుంచి, తనను బదిలీ చేసేశారు. తను సావిత్రి లాగా కాలక్షేపం కోసం ఉద్యోగం చేస్తున్నట్టయితే, తప్పక దానికి రాజీనామా యిచ్చి, ఆ ఒక్కరోజు జూనియర్‌కు సహాయపడి వుండేది...

దేవుడు కూడా దురదృష్టవంతుల ప్రార్థనలు వినిపించుకునే వాళ్ళా కనబడడు. ఈ వారం రోజుల్లో తను ఒక్కడు కాదు-ఎందరెందరు దేవుళ్ళకో మొక్కుకున్నది. ఎవరూ మొరాల కించినట్టులేదు. న్యాయం, ధర్మం అంటూం టారు. ఆ ధర్మదేవత మాటేమిటి? నికృష్ట జీవులూ, దీనాతిదీనులూ అయిన తనలాటి వాళ్ళ రక్తమాంసాలంటే, కన్నీళ్ళంటే ఆ దేవతకిష్టమా; ఇంకా ఆమె అనాగరికంగానే వుందా?

ఇరవైఏళ్ళయినా నిండీ నిండని తను, ఏ మహాపాపం చేసింది? గుమాస్తాగిరీ చేస్తూ, ఏదో విధంగా సంసారాన్నీదుకొస్తున్న నాన్న మరి నాలుక్కాలాలపాటు ఎందుకు బతికుండ కూడదు? ఎలాంటి కిరాతకప్పనులూ, అవినీతి కార్యాలూ చేసివుండని నాన్నను హఠాత్తుగా

ఆ పెందెజబ్బు ఎందుకు పొట్టన పెట్టుకున్నది? ఆనాటినుంచీ రోగిష్టి తల్లీ, పదేళ్ళ తమ్ముడి బాధ్యతలు తన నెత్తినపడినై. టైపిస్టుఉద్యోగం సంపాయించి ఇన్నాళ్ళుగా ఆ బాధ్యతల్ని ఎలాగో నిర్వహించుకువస్తున్నది. ఇప్పుడు? మళ్ళీ ఎంతమంది చుట్టూ తిరిగి, ఎన్నాళ్ళు ప్రయత్నంచేస్తే ఆఉద్యోగందొరుకుతుందో...

జానకి మనస్సు అంతూపొంతూలేని ఆలోచనల్తో గిజగిజలాడుతున్నది. బస్సులొకటొకటే వచ్చి, ఆగకుండా పోతునై. కొందరు మగవాళ్ళు బస్సుతోపాటు పరిగెత్తి ఎక్కిపోతున్నారు. మరికొందరు అందుకోలేక రొప్పుతూ రోస్తూ తిరిగొచ్చి, బస్ స్టాపు దగ్గర నిలబడుతున్నారు. క్రమక్రమంగా, గండు చీమలపుట్ట పగిలినట్టు జనం నిండిపోతున్నారు. జానకి ఆ జనాన్నిచూసి బెదురుకుపోయి, ఎదురుగావున్న షాపులోని గోడ గడియారంకేసి చూసింది. తొమ్మిదిగంటలు! తను అక్కడికొచ్చి రెండుగంట లయిందన్నమాట. ఇంతవరకూ తను బస్సెక్కలేక పోయింది. అలాంటి ప్రయత్నం కూడా చెయ్యలేదు. పరిగెత్తి బస్సెక్కే శక్తి మాటటుంచి. తనలో నిలబడే ఓపికూడా నశిస్తున్నట్టు ఆమె భయపడింది. తనలోని జీవశక్తిని పాదాల ద్వారా, భూదేవి హరించేస్తున్నదా, అనుకున్నది జానకి.

మరో బస్సు వచ్చింది. అదితా నెక్కవలసిన ఇరవై ఒకటో నంబరు బస్సుకాదు. తనింతవరకూ సరిగా చూడలేదుగాని, ఆ నంబరు గల బస్సులు, యీ రెండు గంటల కాలంలో, ఒకటికన్నా ఎక్కువ వచ్చివుండవు. పేరుకు ప్రతి నలభై నిమిషాలకో బస్సని; కాని గంటా గంట బావు స్టాండులో నిలబడకుండా, ఆ బస్సు తనకెన్నడూ దొరకలేదు. హైదరాబాదు నగరంలో అన్నిబస్సులూ ఒక ఎత్తు ఈ ఇరవై ఒకటో నంబరు బస్సు ఒక్కటీ ఒకఎత్తు. అది వచ్చీపోయే రూట్ తతిమ్మా అన్ని బస్సుల కంటే ఎక్కువ దూరం. అన్ని వేళలా జనంతో కిటకిటలాడిపోతూ వుంటుంది.

తొక్కిసలాడుతున్న జనంతో బస్సువచ్చి ఆగింది. జానకి ఏనాథూలేని చొరవతో. కొందరు మగవాళ్ళను తోసుకుంటూ ముందుకు వెళ్ళి, ఫుట్ బోర్డ్ మీద కాలుపెట్టింది. అంతలో నలుగురైదుగురు నెట్టుకుంటూవచ్చి, ఆమెను పక్కకుతోసి బస్ ఎక్కేశారు. బస్ కదిలింది. జానకితూలి కింద పడబోయి, ఎలాగో కాలు నిలదొక్కుకున్నది. అంతలో వెనకనుంచి ఒక మగగొంతు, "ఇంతరద్దీలో మగవాళ్ళను తోసుకుంటూపోయి, ఆడవాళ్ళు బస్ ఎక్కాలని చూడటం ఎందుకో తెలీటంలేదు." అన్నది,

వీపుమీద ఛెళ్ళున చరిచినట్టయి జానకి వెనక్కు తిరిగి చూసింది. ఓ పొడవాటి యువకుడు చేతిలో రెండు మూడు రకాల వారపత్రికలు పట్టుకుని నిలబడివున్నాడు. మనిషిలో నాగరికతకంటే, నాజూకుతనం ఎక్కువగా కనిపిస్తున్నది. దెబ్బతగిలిన కంటికి చల్లగాలి కూడా బాధాకరంగానే వుంటుంది. జానకి మనస్సు అసలే వికలంగా వున్నదేమో. ఆ యువకుడి మాటలతో భగ్గుమన్నది.

C. S. T. No. 41

A. P. G. S. T. No. 561

VIJAYA

COTTAGE INDUSTRIES

SEKHAR INKS (REGD.)

RAJESWARY INKS (DELUXE)

VIVEK INKS (SUPERIOR)

RAMALINGESWARAPET

TENALI

ANDHRA PRADESH

"ఇంత పొద్దుపోయి ఒక ఆడమనిషి తమ కళ్ళెదటే, రెండు గంటలుగా బస్సుకోసం నిలబడివున్నదన్న జ్ఞానంకూడా లేకుండా, అలా ముందుకు తోసుకుంటూ పోయి బస్సెక్కారే మీ మగాళ్ళు! వాళ్ళకి చెప్పండి ఆ బుద్ధి!" అన్నది జానకి కోపంగా.

"అందర్నీ కలిపి తిడతా రెందుకు?" అన్నాడు యువకుడు రోషంగా. అంతలో అతనిప్రక్కవున్నవాళ్ళు. అతణ్ణి మరి మాట్లాడ వద్దని వారించారు.

మరుక్షణం జానకి తనను తను సంబాళించుకున్నది. తన తొందరపాటుకు సిగ్గుపడింది. ఇంతకుపూర్వం ఎన్నడూ తనిలా ఎవ్వరితోనూ పేచీపడి ఎరగదు. తను ఫుట్‌బోర్డ్‌మీదినుంచి కింద పడిపోయివుండేదాన్నని హెచ్చరించేందుకే అతనలా మాట్లాడి వుంటాడు.

సహనం, సభ్యత, సంస్కృతి, సంస్కారం, శీలం- ఇవన్నీ మానవుడి మానసికస్థితి ప్రశాంతంగా వున్నప్పుడే అతడికి ఉపకరిస్తాయేమో! కాని, అలాంటిప్రశాంతపరిస్థితిబహుఅరుదుగానే అతడికి లభ్యమవుతుంది. మనిషి మహానగరాలనబడే కారడవుల్లో బతుకుతున్నాడు. ఇక్కడ మరోరకం ఆటవికనీతి అమలు జరుగుతున్నదేమో.

జానకి తనేదో పెద్ద తప్పు చేసినట్టు బాధపడసాగింది. ఆమెపక్కగా ఎవరో వచ్చి నిలబడ్డారు. జానకి తలతిప్పి చూచేంతలో "మీ రెక్కడిదాకా వెళ్ళాలండీ?" అన్న ఆడ గొంతు ఉర్దూలో సన్నగా, ఎంతో మృదువుగా వినిపించింది.

జానకి ఆ ప్రశ్నించిన స్త్రీకేసి చూసింది. ఆమె ధరించిన ఎర్రటి నైలాన్ చీర, ఆకుపచ్చ జాకెట్ బస్‌స్టాండ్ పక్కనున్న విద్యుత్ దీప కాంతిలో మిలమిలా మెరసి పోతున్నాయి. మనిషి తెల్లగా, పొడవుగా వున్నది. ఎంతో అందమైన ముఖం. ఆవిడ ప్రశ్నించిన మాటే మరిచి, జానకి కళ్ళింత చేసుకుని చూడ సాగింది. లిప్‌స్టిక్ వేసుకున్న ఆ సుందరి పెదాలమీద చిరునవ్వు కదుల్లాడింది, ఆమె వయసు ముప్పై, ముప్పై అయిదు సంవత్సరాల మధ్య వుంటుంది, కాని, శరీరం మీద ఇంకా ఆ చివురుటాకు నవనవత్వపు తళుకు తగ్గిపోలేదు. దేహం యిప్పుడిప్పుడే తన సన్నని నాజూకుతనం విడిచి, గుండ్రగా బొద్దుతేలబోతున్నట్టు కనిపిస్తున్నది. ఎంత సింపుల్‌గా, ఎంతఅందంగావున్నదామే. అనుకున్నదిజానకి.

"మీ రెక్కడిదాకా వెళ్ళాలండీ?" అని ఆ సౌందర్యరాశి మళ్ళీ అంత మృదువుగానూ ప్రశ్నించింది. ఆ స్వరంలో ఎంతో గొప్పింటి లక్షణం, మర్యాదా జానక్కి కనిపించాయి. రూపానికి తగిన సంస్కారంకూడా వుంది మనిషిలో-

"అల్లావుద్దీన్ బంగళా దగ్గిరదాకా వెళ్ళాలండీ." అన్నది జానకి ఉర్దూలోనే.

"నేనుకూడా బేగంపేట దాకా వెళ్ళాలి. ఫర్వాలేదు. తోడు దొరికారు. పొద్దు పోయిందని భయపడుతూనే వచ్చాను." అన్నదామె.

జవాబుగా జానకి ఓ పేలవమైన నవ్వు నవ్వింది. ఇంకోరోజునయి వున్నట్టయితే ఆమెతో సరదాగా కబుర్లాడి వుండేది. ఈనాడు జానకి మనస్సు కలతబారివున్నది.

"అసలేనాడూ బస్సులెక్కనదాన్ని కాను. మావారు ... జిల్లాకలెక్టర్ ... తన స్నేహితుడెవరికో ఓ వారంరోజులు అవసరం అంటూ కారు తీసుకుపోయారు." అన్నదాస్త్రీ.

జానకి ఎంతో ఆశ్చర్యంగా ఆవిడకేసి చూసింది. కొంచెం విలువైన చీర జాకెట్ తప్ప, ఆమె శరీరంమీద అంతహోదాగల కలెక్టర్ భార్యకుండవలసిన నగానట్రా ఏమి లేవు. మెడలో ఓనల్లపూస దండమాత్రంవుంది. చేతులకూ ఎరుపూ పసుపూ రంగులగల మామూలు గాజులు. మర్యాద, మన్ననా తప్ప డాబూదర్పంలేని మనిషన్నమాట.

"మీ వారు ఏ జిల్లాలో పనిచేస్తున్నారు?" అని అడిగింది జానకి. ఎంతో గౌరవం. నమ్రతా వుట్టిపడే గొంతుతో.

"ఆయన పేరు వినేవుంటారు, సులేమాన్ ఖాన్, తెలంగాణాలో పనిచేస్తున్నారు," అంటూ ఆ స్త్రీ బస్‌వచ్చే వైపుకు ఓమారుచూసి. కొంచెం విసుగ్గా "ఈ బస్సుల్ని నమ్ముకు..

లాభం లేదండీ, అయినా నేనెప్పుడెక్కాను గనక బస్సులు. ఇది నాకు తెలియని వేళాం. ఈ దగ్గర్లోనే నా స్నేహితురాలి ఇంట్లో ఫన్‌క్షన్ ఏదో వుంటే వచ్చాను. టాక్సీ లో ఒంటరిగా వెళ్ళాలంటే భయం వేసింది. అసలే రోజులు బాగాలేవు, చూడండి." అన్నది.

మనిషి చూడటానికి ఎంత సాధారణంగా వుందో, తెలివితేటల్లో అంతఅసాదారణురాలుగా జానక్కి కనిపించింది. "మరోలా అనుకోకండి. మీరు హైదరాబాదులోనే వుంటున్నారా?" అనడిగింది జానకి,

ఆ ప్రశ్న వింటూనే ఆ స్త్రీ చిన్నగా నవ్వుతూ "వారక్కడా నేనిక్కడా! ఏం చేస్తాం లెండి; ఎదిగొచ్చే పిల్లల బాధ్యతలు తప్పేవి కాదుగదా. వాళ్ళ చదువులకోసం నేనిక్కడే వుంటున్నాను. ముగ్గుర్లో పెద్దది మొదటి సంవత్సరం మెడిసన్ చదువుతున్నది. మగపిల్లలిద్దరూ హైస్కూల్లో చదువుతున్నారు" అన్నదామె.

అదీ జీవితమంటే అనుకున్నది జానకి. అంతా పూర్వజన్మ సుకృతం. సుఖ సంతోషాలకే తప్ప చీకూ చింతల కెక్కడా ఆస్కారం లేని నిండు బ్రతుకులు.

"మా కలెక్టరుగారు ఊళ్లో లేనప్పుడు నేనిలాగే సింపుల్‌గా వుంటాను. ఎంత గొప్ప వాళ్ళింటి ఫన్‌క్షన్‌కైనా వారు లేనప్పుడు చిన్నమెత్తు బంగారంకూడా ధరించకుండా పోవటం నా కలవాటు. ఇది నా పుట్టింటి పెంపకంలోనే వున్నదనుకోండి. మానాన్నగారు నిజాం ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. ఆడంబరాలంటే ఆయన కే మాత్రం గిట్టదు" అన్నదాస్త్రీ.

జానకి ఆమె మాటలకు ముగ్ధురాలై పోయింది. మళ్ళీ ఏదో ప్రశ్నించబోయిందిగాని, అంతలో ఆవిడే, "బేగంపేటలో - ఆ రోడ్డు మలువుకు, కుడిచేతివైపున కొత్తగా కడుతున్న బంగళామాదే, బస్‌స్టాప్‌లో పరిచయమేగదా, అని మీరు తోసెయ్యకుండా, వీలుచూచుకుని ఓ సారి మా యింటికిరండి. మిసెస్‌సులేమాన్ ఖాన్ ఇల్లనిచెపితే, అక్కడ ఎవరైనా మిమ్ముల్ని మా ఇంటికి తీసుకువచ్చి దిగవిడిచి పోతారు," అన్నది.

ఆ ఆహ్వానం జానక్కి చాలా విస్మయం కలిగించింది. ఆ మరుక్షణంలోనే ఆనందంతో ఆమె హృదయం ఉప్పొంగిపోయింది. కలెక్టర్ భార్యతో పరిచయం, ఆమె యింటికి రాకపోకలు, ఎంత గొప్ప అవకాశం! అంతలో జానకి మనస్సులో ఒక ఆశాకిరణం తళుక్కుమన్నది. తన ప్రార్థనల్ని ఆలకించి భగవంతుడే యీమెను యిక్కడికి పంపాడనుకున్నదామె. ఇంతకుముందు తాను ఇంగితం కోల్పోయి భగవంతుణ్ణి దూషించింది. అందుకామె మనస్సులోనే లెంపలు వేసుకుని, మళ్ళీ ఉద్యోగం రాగానే, తిరుపతికి వస్తానని మొక్కుకున్నది.

జానకి, కలెక్టరు భార్యకేసి కొంచెం దగ్గరగా నడచి, జంకుతూనే తన ప్రస్తుత స్థితి అంతా ఏకరువు బెట్టింది. ఆవిడ ఎంతో ఓపిగ్గా, శ్రద్ధగా అంతా విని, ఎంతో సానుభూతిగా, "మరీ అంత దిగులు పడిపోకండి. మా కలెక్టరు గారు ఎల్లుండే రాబోతున్నారు. మీ అదృష్టం! ఆయన నా మాట కాదనరు. హైదరాబాదులో పెద్ద పెద్ద ఆఫీసర్లందరూ ఆయనకు తెలిసిన వాళ్ళే. నిమిషాలమీద మీ కెక్కడో క్కడ ఉద్యోగం అయిపోతుంది. ఈలోపల అట్టే మనస్సును కష్టపెట్టుకోకండి" అన్నది.

జానక్కి ఆ మాటలతో నెత్తిమీది బరువు ఎవరో చెయ్యి ఆసరాతో గాఢాంధకారంలో దారికానక అలమటించిపోతున్న తనకు, ఎవరో చేయి సాయం యిచ్చి, కరదీపికతో దారి చూపినట్టుగా ఆమె ఆనందపడింది. చీకటి గదిలో ఏదో అదృశ్య హస్తం స్విచ్ ఆన్‌చేసి మెర్‌క్యురీలైటు వెలిగించినట్టు, జానకి ముఖం మిలమిలా మెరిసిపోయింది.

"మీ సహాయం మర్చిపోనండి. ఎల్లుండి తప్పక మీ ఇంటి కొస్తాను." అన్నది జానకి ఎంతో వినయంగా. అంతలో బస్ వచ్చింది. ఈసారి జనం తొక్కిసలాట అంతగా లేదు. ఇద్దరూ బస్సెక్కి ప్రక్కప్రక్కనే కూర్చున్నారు. కలెక్టరుభార్య ఏవేవో చెప్పుకుపోతూనే

వున్నది, జానకి ఊఁ కొడుతూ, తలాడిస్తున్నది. కాని, ఆమె ఏదీ శ్రద్ధగా వినటంలేదు. ఆమె మనస్సు ఊహాలోకాల్లో విహరిస్తున్నది. ఇక నుంచి తనకు గొప్ప హోదాలోవున్న వ్యక్తి రికమెండేషన్ అవసరం అయినప్పుడల్లా దొరుకుతుంది. అసలు దొరికిన ఉద్యోగం పోతుందన్న భయమే వుండదు.

బస్ కండక్టర్ టిక్కెట్ అడిగాడు. జానకి పాస్ అని చెప్పింది. కలెక్టర్ భార్యకేసి చేయి వూపాడు. ఆమె ఎంతో తాపీగా పెద్ద పర్సులోంచి డబ్బు బయటికితీసే ప్రయత్నం ప్రారంభించింది. కండక్టరు విసుక్కుంటున్నట్టు ముఖంపెట్టాడు. జానకి వెంటనే తన పర్సులోంచి డబ్బుతీసి టిక్కెట్ కొన్నది. దాన్ని యివ్వబోయే సరికి మిసెస్ ఖాన్ చిరుకోపం కనబరుస్తూ, "మీరు కొన్నారా? ఎందుకండీ, నేను డబ్బుతీస్తుంటే!" అన్నది.

జానకి మాట్లాడలేదు. అతిగా డబ్బున్న వాళ్ళలో కొందరు పిసినారులుగా వుండటం ఆమె ఎరుగును. బహుశా, యీ కలెక్టరుగారి శ్రీమతి ఆ కోవకు చెందుతుందేమో అనుకున్నదామె. అంతలో బస్ బేగంపేట స్టేషన్ సమీపించింది. కలెక్టరు గృహిణి చేయి బయటికి పెట్టి, "అదుగో, చూడండి! అదే, మా నాన్నగారి బంగళా" అని చెప్పింది. జానకి అటుకేసి చూసింది. చీకట్లో అన్నిళ్ళూ మసకమసకగానే కనిపిస్తున్నాయి. అయినా ఆ గొప్పింటావిడ ఏమనుకుంటుందో అని, ఆమె అతి జాగ్రత్తగా ఆ ప్రాంతం కేసి చూస్తూ, చిన్న గొంతుతో "బంగళా చాలా పెద్దదిలా వుందండీ, అందంగా వుంది" అనేసింది.

జానకి తలతిప్పి చూసే సరికి ఆమె ప్రక్కన కలెక్టరుగారి భార్యకు బదులుగా, ఓ లావుపాటి ముసలావిడ కూర్చుని వుంది. జానకి ఆశ్చర్యంగా బస్సు నుంచి దిగిపోయే ద్వారం కేసి చూసింది. ఆవిడ బస్ దిగడానికి సిద్ధంగా అక్కడ నిలబడి వున్నది. అంతలో బస్ ఆగింది. ఆవిడ చప్పునదిగి చీకటిలో కలిసి పోయింది.

జానకికి ఆమె ప్రవర్తన ఆశ్చర్యాన్నీ, అనుమానాన్నీకూడా కలిగించింది. అంతవరకూ తనతో ఎంతో ఆప్యాయంగా మాట్లాడినావిడ చెప్పాచెయ్యకుండా అంత హడావిడిగా బస్ ఎందుకు దిగిపోయినట్టు? ఆమె చెప్పినవన్నీ అబద్ధాలేనా? ఆమె అసలు కలెక్టర్ భార్యా కాదా? ఊహుఁ అలా అయివుండదు. బస్‌స్టాప్‌లో నిలబడివున్న తనతో, ఆవిడ అన్ని అబద్ధాలు చెప్పవలసిన అవసరం ఏముంటుంది?

జానకి తన మనస్సులో రేగిన అనుమానాలన్నిటినీ ఒక పక్కకు నెట్టేసింది. ఉద్యోగావసరం, అది దొరుకుతుందన్న ఆశా, ఆమెను జోకొట్టినై. తను ఎల్లుండి తప్పకుండా ఆవిడ ఇంటికివెళ్ళి, భర్తద్వారా ఉద్యోగానికి మంచి రికమెండేషన్ సంపాదించుతుంది.

మరో అయిదు నిమిషాలకల్లా బస్ జానకి దిగిపోవలసిన చోటుకు చేరింది. ఆమె హడావిడిగా పుస్తకాలు సర్దుకుని లేవబోతూ, పర్సు


శ్రీ దుర్గా ట్యుటోరియల్ కాలేజి

(వోల్డ్ విశాలాంధ్ర ట్యుటోరియల్ కాలేజి)

అరండల్ పేట,

11 వ లైను, 1 వ అడ్డరోడ్డు,

గుంటూరు

B. A., B. Sc., B. Com, P. U. C. మెట్రిక్, S. S. L. C. క్లాసులు. విద్యార్థుల విజయముకై అహర్నిశములు పనిచేయు సంస్థ. సమర్థులగు ఉపాధ్యాయులు, అన్ని సబ్జక్టులు చెప్పగల ప్రిన్సిపాల్. బాలుర, బాలికల శాఖలు గలవు. ఉద్యోగులకు రాత్రి క్లాసులు, లేబరేటరీ, హాస్టల్సు గలవు.

ప్రిన్సిపాల్:

కె. మల్లిఖార్జునలింగం.

కనబడక, షాక్ తిన్నట్టయిపోయి సీట్‌లో కూల బడింది. పర్స్ సీట్‌లో ఏమూలాలేదు, కిందకు జారిందేమో అని వెతికితే, అక్కడాలేదు. జానకి నిర్విణ్ణురాలయింది. కళ్ళు గిర్రున తిరిగాయి. బస్‌కండక్టర్ ఆమె స్థితిగమనించి, ఏమీ ప్రశ్నించకుండానే, తనూ ఆ చుట్టు పక్కల సీట్లన్నింటికిందా వెతికాడు. బస్ ప్రయాణీకుల్లో కొందరు బస్ యీ చివరినుంచి, ఆ చివరవరకూ గాలించారు. పర్స్‌దొరకలేదు.

"ఇంతదాక మీ పక్కన కూచున్నావిడెవరు ?" అని అడిగాడు కండక్టరు జానకిని.

"నాకు లోగడ పరిచయంలేదు. జిల్లా కలెక్టరు భార్యనని చెప్పింది" అన్నది జానకి నీరసంగా.

బస్‌లో కొందరు పెద్దగా నవ్వారు. జానకి బిక్కమొహంతో వాళ్ళకేసి చూసింది.

"అమ్మా ! మీ రొట్టి అమాయకులు. కలెక్టరుగారి భార్యకు యీ అర్ధరాత్రివేళ బస్సుల్లో తిరగాల్సిన ఖర్మేంపట్టె ! ఈ మధ్య అడ జేబుదొంగలు బయల్దేరారు" అన్నాడు కండక్టరు సానుభూతిగా.

"జేబుదొంగా ! చూట్టానికి గొప్పింటి మనిషిలా కనిపించింది." అన్నది జానకి నూతిలోంచి మాట్లాడుతున్నట్టు.

"అలా వుంటేనే ఎవరికీ అనుమానం కలగదు" అన్నాడు కండక్టరు. బస్ ప్రయాణీకులు తలా ఒకమాటన్నారు :

"నైలాన్‌లూ, జార్జెట్‌లూ వేసేసింది."

"అదో లెఖ్ఖ ! ఇతర్లు నెలల్లా కష్టపడి సంపాదించే డబ్బు తానొక్కరోజులో స్వాహా అనగలదు."

"పాపం, చిన్నపిల్లని ఎంతమోసంచేసింది" అన్నది లావుపాటి ముసలావిడ, జానకి ముఖంలోకి జాలిగా చూస్తూ.

జానకి యివేవీ వినిపించుకునే స్థితిలోలేదు. నీరసించిపోయిన శరీరంలో ఒక్కసారిగా దయ్యబ్బలం ప్రవేశించినట్టయి, ఆమె గబగబా బస్‌దిగింది. కాని, ఆ తరువాత ఇంటికేసి నడిచేందుకు, ఆమె కాళ్ళాడలేదు. అడుగుతీసి అడుగువేస్తుంటే, తానేదో ఇసుకపాతర్లోకి కుంగిపోతున్నట్టుగా ఆమెకు భయంకలిగింది.

జానకి ఇంటిని సమీపించేసరికి, వరండాలో తల్లి గోడకు చేరగిలబడి వూపిరి సలపకుండా దగ్గుతూండడం కనిపించింది. కూతురు గడప దగ్గిరకు రావడంచూస్తూనే ఆమె, "ఇంతపొద్దుపోయిందేమమ్మా ? ఎక్కడికెళ్ళావ్ ?" అంటూ వచ్చే అయాసాన్ని ఆపుకుంటూ ప్రశ్నించింది.

ఎన్నడూ లేంది, జానకి కా క్షణంలో తల్లి అడిగిన ప్రశ్న ఏదో తిట్టుగా, నేరారోపణగా వినబడింది. ఆమె చురచురలాడుతూ, "ఆఁ, వెళ్ళాను యమలోకానికి ! అక్కడా నాకు చోటు దొరకలేదు" అంటూ గడపదాటి గదిలోకి వెళ్ళిపోయింది.

తల్లి కూతురుకేసి ఆశ్చర్యంగా చూసింది. ఇంత కటువైన జవాబు ఆమె ఏనాడూ విని వుండలేదు. ఏం జరిగివుంటుంది ? అనుకుంటూ ఆమె లేవబోయేంతలో, దగ్గుతెరవచ్చి ఉక్కిరిబిక్కిరైపోయింది. జానకి గుండెలు తరుక్కుపోయే బాధతో, దుఃఖంతో మంచం మీద పడుకుని, దిండులో తలపెట్టుకుని వెక్కివెక్కి ఏడ్వసాగింది.

"అక్కయ్యా !" అంటూ కోడిగుడ్డు లాంతరు ముందు కూర్చుని చదువుకుంటున్న పదేళ్ళ తమ్ముడు జానకిని పిలిచి, ఆమె పలకకపోయేసరికి, గొంతు పెద్దదిచేసి "అక్కయ్యా ! రేపు ఫీజు కట్టకపోతే నన్ను పరీక్షకు కూర్చోనివ్వరట" అన్నాడు.

గుండెలవిసిపోయేలా దగ్గుతున్న తల్లి దగ్గూ, పదేళ్ళ పసివాని దీనవచనాలూ జానకి వెక్కిళ్లతో కలిసి — గాఢనిద్రలో వున్న ధర్మదేవతకు మేలుకొలుపు పాడాయి. ఆ ఇల్లు ఓ వింత వాతావరణంతో నిండిపోయింది.

రాబందులు అన్నికాలాల్లోనూ విశృంఖలా జీవులు. వాటికి నైతిక విలువలంటూ వున్న సంగతే తెలియదు. పైగా వాటికి ఆ నైతిక విలువలతో అవసరం కూడా లేదు. అందుకేనేమో హత్యకంటె దొంగతనం పెద్దనేరంగా నైతిక శాస్త్రంలో నిర్వచించబడింది.

★